సాక్షి ఒడిశా

బుధవారం । 11 । జూన్ । 2025

నేడు శ్రీ జగన్నాథుని స్నానోత్సవం



భువనేశ్వర్: పవిత్ర శ్రీక్షేత్రంలో శ్రీ జగన్నాథుని స్నానోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు భారీ సన్నాహాలు చేస్తున్నారు. బుధవారం జరగనున్న ఈ యాత్ర సన్నాహాలు దైతపతి వర్గం సేవకులు ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తారు. వీరి ఆధ్వర్యంలో స్వామి సేవలు స్నాన పూర్ణిమ ముందు రోజు జ్యేష్ట శుక్ల త్రయోదశి తిథి నుంచి ఆరంభమై సుమారు నెల రోజులపాటు నిరవధికంగా కొనసాగుతాయి. ప్రధానంగా సువిశాల రత్న వేదిక నుంచి చతుర్ధా మూర్తుల మూల విరాట్టుల్ని సురక్షితంగా స్నాన మండపానికి తరలించడం భారీ బృహత్తర ప్రక్రియ. తొలుత రత్న వేదిక నుంచి భారీ మూల విరాట్టుల్ని చెక్కుచెదరకుండా కిందకు దించి స్నాన మండపానికి తరలిస్తారు. ఈ నేపథ్యంలో మూల విరాట్ల రక్షణ కోసం సురక్షిత ఏర్పాట్లు త్రయోదశి నాటి రాత్రి నుంచి ఆరంభిస్తారు. దైతపతుల ప్రత్యక్ష పర్యవేక్షణలో మూల విరాటులకు బాహుటా కొయ్యల్ని అమర్చుతారు. సాక్షి గోపాల్ క్షేత్రం వకుల వనం నుంచి తరలించే ప్రత్యేక మానుల్ని బాహుటా కొయ్యలుగా వినియోగిస్తారు. స్నాన యాత్రకు ముందస్తుగా వీటిని తరలించి అందుబాటులో ఉంచారు. మరో వైపు రత్న వేదిక నుంచి మూల విరాటుల్ని కిందకు దించేందుకు తాటి మట్టలతో చారుమళ్లని ఏర్పాటు చేయడం మరో విశేషం. ఈ సందర్భంగా పూరీ సాగర తీరంలో సైకత శిల్పి పద్మశ్రీ సుదర్శన్ పట్నాయక్ అపురూప సైకత శిల్పం ఆవిష్కరించారు.

న్యూస్‌రీల్

సామూహిక ఉపనయనాలు



సామూహిక ఉపనయనాల్లో పాల్గొన్న యువకులు

రాయగడ: జిల్లాలోని గుణుపూర్‌లో గల తిరుపతి బాలాజీ మందిరం ప్రాంగణంలో బ్రహ్మణ సేవా సమాజం ఆధ్వర్యంలో రెండు రోజులు పాటు సామూహిక ఉపనయనాలు జరిగాయి. ఉచితంగా నిర్వహించిన కార్యక్రమంలో పది మంది బ్రహ్మచారులు ఈ దీక్షను పాటించారు. పండితులు ప్రకాష్ రథొ, నళినీ మహాంతిల పర్యవేక్షణలో జరిగిన ఉపపనయనాల కార్యక్రమం మంగళవారం ముగిసింది.

చెట్టును ఢీకొట్టిన టిప్పర్

- పలువురికి స్వల్పగాయాలు



నుజ్జయిన టిప్పర్

రాయగడ: టిప్పర్ అదుపుతప్పి చెట్టును ఢీకొంది. ఈ ఘటన జిల్లాలోని కొలనార సమితి గడ్డి శెఖాల్ పంచాయతీలోని కొలటిగుడ గ్రామ సమీపంలో మంగళవారం ఉదయం చోటు చేసుకుంది. టిప్పర్‌లో ప్రయాణించే హెల్పర్, డ్రైవర్లకు స్వల్పగాయాలు తగిలాయి. ప్రమాదం చోటు చేసుకున్న సమయంలో అక్కడ ఉన్న యువకులు టిప్పర్‌లో ఉన్న హెల్పర్ , డ్రైవర్లను బయటకుతీసి కొలనార ఆస్పత్రికి చికిత్స కోసం తరలించారు. సమాచారం తెలుసుకున్న చందిలి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ప్రమాదంలో టిప్పర్ నుజ్జునుజ్జు అయింది.

చోరీ కేసులో నిందితుడి అరెస్టు



ఆర్‌పీఎఫ్ సిబ్బంది అదుపులో నిందితుడు

రాయగడ: మునిగుడ రైల్వే పోలీసులు సోమవారం నాడు అనుమానాస్పదంగా కనిపించిన ఒక ప్రయాణికుడిని అరెస్టు చేశారు. అతని నుంచి తొమ్మిది మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. అరెస్టయిన వ్యక్తి ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం రాయిపూర్ ప్రాంతానికి చెందిన అజయమీ సాహు (25)గా గుర్తించారు. ఆర్‌పీఎఫ్ ఏఎస్‌ఐ కె.స్వయం ప్రకాష్ తెలియజేసిన వివరాల ప్రకారం.. సోమవారం రైల్వే స్టేషన్‌లో ఆర్‌పీఎఫ్ సిబ్బంది తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో ఒకటో నంబరు ప్లాట్‌ఫారం వద్ద సాహు అనుమానాస్పదంగా కనిపించాడు. దీంతో అతని వద్ద ఉన్న బ్యాగును తనిఖీలు చేయగా స్మార్ట్ మొబైల్ ఫోన్లు తొమ్మిది కనిపించడంతో వాటిని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం అతనిని విచారించగా వివిధ రైల్వే స్టేషన్లలో ప్రయాణికుల నుంచి వీటిని దొంగిలించినట్టు అంగీకరించాడు. అతనిపై పోలీసులు కేసు నమోదు చేసి కోర్టుకు తరలించారు.

ఇంట్లో దొంగలు పడి రూ.20 లక్షలు చోరీ



చోరీ జరిగిన ఇంటి వద్ద దర్యాప్తు చేస్తున్న సిమిలిగుడ పోలీసులు

కొరాపుట్: కొరాపుట్ జిల్లా సిమిలిగుడ పట్టణం నుంచి నందపూర్ వెళ్లే మార్గంలో కుశల ఆశ్రమ ప్రాంతంలో శత్రుఘ్న ప్రధాన్ అనే వ్యక్తి ఇంటిలో మంగళవారం వేకువజామున దొంగలు పడ్డారు. ఉదయం ఇంటికి వచ్చిన కుటుంబం దొంగతనం జరిగినట్లు గుర్తించారు. ఈ చోరీలో రూ.10 లక్షల నగదుతపాటు మరో రూ.10 లక్షల విలువైన బంగారు ఆభరణాలు చోరీకి గురైనట్లు తెలిపారు. వెంటనే బాధితులు సిమిలిగుడ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయగా వారు సంఘటన స్థలానికి వచ్చి దర్యాప్తు ప్రారంభించారు.

రైలు నుంచి జారిపడి యువకుడి మృతి

రాయగడ: నడుస్తున్న రైలు నుంచి ప్రమాదవశాత్తు జారిపడి యువకుడు మృతి చెందాడు. ఎల్లపి–ధన్‌బాద్ ఎక్స్‌ప్రెస్‌లో జార్ఖండ్‌కు చెందిన బిజయ్ భుయ్య (34) ప్రయాణిస్తున్నాడు. సోమవారం సాయంత్రం రాయగడ రైల్వే స్టేషన్‌లో ఐదో నంబర్ ప్లాట్‌ఫారంపైకి రైలు చేరుకుంటున్న సమయంలో భుయ్య దిగేందుకు ప్రయత్నించగా ప్రమాదవశాత్తు కింద పడిపోవడంతో ప్రమాదం చోటుచేసుకుంది. దీంతో సంఘన స్థలం వద్దే ప్రాణాలు కోల్పోయాడు. రైల్వే పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.



జగన్నాథ రథాల ప్లాట్‌ఫారం తయారీలో వడ్రంగులు

దేవస్నాన పూర్ణిమకు అడపా మందిరం సిద్ధం



శ్రీజగన్నాథ, సుభద్ర, బలభద్రులు



రథాల తయారీని పర్యవేక్షించిన బీజేపీ శ్రేణులు

పర్లాకిమిడి: శ్రీజగన్నాథ, సుభద్ర, బలభద్రుల దేవస్నాన పౌర్ణమికి పర్లాకిమిడి శ్రీమందిరంలో అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. దేవదేవుడిని శ్రీమందిరం నుంచి బుధవారం ఉదయం 11 గంటల సమయంలో మందిరం ప్రాంగణంలో ఉన్న అడపా మందిరం వద్దకు తీసుకువచ్చి 108 కొబ్బరి బొండాలు, పంచామృతాలతో స్నానం చేస్తారు. ఈ సందర్భంగా జగన్నాథుడు గణేశుని అవతారంలో భక్తులకు దర్శనమిస్తారు.

మాజీ ఎమ్మెల్యే నారాయణ రావు సందర్శన

పర్లాకిమిడి రథయాత్ర ఒడిశాలో పూరీ పుణ్యక్షేత్రం తర్వాత మూడు రథాలతో ఏటా వైభవంగా జరుపుతారు. ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మఝి ఆదేశాల మేరకు మంగళవారం మాజీ ఎమ్మెల్యే కోడూరు నారాయణ రావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు నబకిశోర్ శోబోరో, సీనియర్ నాయకులు ఛిత్రి సింహాత్రి, రథయాత్ర కమిటీ సభ్యులతో జగన్నాథ రథాల పనులను పర్యవేక్షించారు. అనంతరం నూతన జగన్నాథ మందిరం పునఃనిర్మాణ పనులను కమిటీ సభ్యులు దుర్గాప్రసాద్ పాణిగ్రాహిని అడిగి తెలుసుకున్నారు. వర్షం కారణంగా రథాల పనులు మందకోడిగా సాగుతున్నా రథాలకు కొత్త కలప రావడంతో పనులు వేగంగా సాగుతున్నాయని రథయాత్ర కమిటీ సభ్యులు కుమార్ తెలిపారు.



పర్లాకిమిడిలో దేవస్నాన పూర్ణిమకు సిద్ధం చేస్తున్న కమిటీ

పర్లాకిమిడిలో కుండపోత వర్షం



ఎస్.కె.సీ.జీ కళాశాలలో పడుతున్న కుండపోత వర్షం

పర్లాకిమిడి: పర్లాకిమిడిలో మంగళవారం తెల్లవారుజామున కుండపోత కురిసింది. దీంతో వాతావరణం చల్లబడింది. ఈ వర్షం గుమ్మా, కాశీనగర్, పర్లాకిమిడి, గుసాని, రాయఘడ బ్లాక్ వరకూ విస్తరించింది. కుండపోత వర్షంతో రైతులు ఖరీఫ్ పంటకు సమాయత్తమవుతున్నారు.



పర్లాకిమిడిలో కారుమబ్బులతో వాతావరణం

నడుస్తున్న కారు దగ్ధం



దగ్ధం అవుతున్న కారు



దగ్ధమైన కారు

కొరాపుట్: నడుస్తున్న కారు నుంచి అకస్మాత్తుగా మంటలు రేగడంతో కారు డ్రైవర్ రెప్పపాటులో తప్పించుకున్నాడు. మంగళవారం నబరంగ్‌పూర్ జిల్లా డాబుగాం పోలీస్ స్టేషన్ పరిధి రాష్ట్ర రహదారి 39 పై ఆదర్శ విద్యాలయం ఎదుట ఒడి 08వి 3816 నంబర్ గల కారు దగ్ధమైంది. వెనుక నుంచి గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టి వెళ్లడంతో ప్రమాదం జరిగి మంటలు రేగాయి. ఇది తెలిసి డాబుగాం నుంచి అగ్ని మాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపులోనికి తెచ్చారు. కలహండి జిల్లా బడపడా గ్రామానికి చెందిన బినోద్ ఈ కారు నడుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

ఉరి వేసుకుని యువకుడి ఆత్మహత్య



ఇంటిలో ఉరి పోసుకున్న లోకేష్

జయపురం: తలుపులు మూసి ఉన్న ఒక ఇంటిలో ఒక యువకుడు ఉరి పోసుకొని చనిపోయిన ఘటన బయటపడింది. మరణించిన యువకుడు మధ్యప్రదేశ్ రాష్ట్రం సివన్ జిల్లా ఉగిలి గ్రామం లోకేష్ బైసావర్ అని గుర్తించారు. ఈ సంఘటనపై జయపురం సదర్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు పోలీసు అధికారి సచీంద్ర ప్రధాన్ వెల్లడించారు. పోలీసులు సైంటిఫిక్ టీమ్‌లు సంఘటనా ప్రాంతానికి వెళ్లి దర్యాప్తు ప్రారంభించారు. పోస్టుమార్టం తర్వాత మృత దేహాన్ని అతడి కుటుంబ సభ్యులకు అప్పజెప్పినట్లు పోలీసు అధికారి సచీంద్ర ప్రధాన్ వెల్లడించారు. పోలీసు అధికారి వివరణ ప్రకారం.. సదర్ పోలీసు స్టేషన్ పరిధి గేట్‌గుడ గ్రామంలో సంజిత్ నాయిక్ హైడ్రోలిక్ గేరేజ్‌లో లోకేష్ గత 6 నెలల నుంచి మెకానిక్ హెల్పర్‌గా పనిచేస్తున్నాడు. గత ఏప్రిల్‌లో సెలవు తీసుకొని ఇంటికి వెళ్లాడు. ఈ నెల 7వ తేదీన ఇంటి నుంచి తిరిగి వచ్చిన పనిలో చేరాడు. సోమవారం 10 గంటల వరకు లోకేష్ గేరేజ్‌కు రాలేదు. అతడు రాకపోవడంతో లోకేష్‌ను పిలుచుకు రమ్మని ఒక వ్యక్తిని అతడి ఇంటికి పంపాడు. ఇంటి లోపల గెడ వేసి ఉండటంతో వెళ్లిన వ్యక్తి తలుపు తట్టి పిలిచాడు. తలుపు తెరవకపోవడంతో కిటికీ నుంచి చూడగా లోకేష్ ఉరికి వేలాడుతూ కనిపించాడు. ఈ విషయాన్ని అతడు గేరేజ్ యజమాని సంజిత్‌కు తెలియజేశాడు. యజమాని సంజిత్ జయపురం సదర్ పోలీసు స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

వ్యాన్, బైక్ ఢీకొని ఒకరి మృతి

రాయగడ: ఆంధ్రప్రదేశ్ నుంచి భిలాయికి మామిడి పండ్ల లోడుతో వెళ్తున్న పికప్ వ్యాన్ అదుపుతప్పి ఎదురుగా వస్తున్న బైకును ఢీకొట్టింది. ఈ సంఘటనలో బైకు డ్రైవ్ చేస్తున్న బి.రాహుల్ (24) అనే యువకుడు మృతి చెందాడు. మృతుడు స్థానిక మజ్జివీధికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. సోమవారం రాత్రి చోటు చేసుకున్న ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలియజేసిన వివరాల ప్రకారం.. స్థానిక జగన్నాథ మందిరం సమీపంలో పికప్ వ్యాన్ అతివేగంగా నడుపుతూ మరో వాహనాన్ని తప్పించే క్రమంలో ఎదురుగా వస్తున్న బైకును ఢీకొన్నాడు. దీంతో తీవ్రగాయాలకు గురైన రాహుల్‌ను అక్కడి వారు స్థానిక ఆస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే అతడు మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. వ్యాన్ డ్రైవర్ నకుల ప్రసాద్ వాహనాన్ని విడిచిపెట్టి పరారయ్యాడు. వ్యాన్ హెల్పర్‌ను అదుపులోకి తీసుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చందిలి ఐఐసీగా ఉత్తమ కుమార్‌సాహు



ఉత్తమ కుమార్ సాహు

రాయగడ: జిల్లాలోని చందిలి పోలీస్‌స్టేషన్ ఐఐసీగా ఉత్తమ కుమార్ సాహు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. గుణుపూర్ ఆదర్శ పోలీస్‌స్టేషన్‌లో ఐఐసీగా విధులు నిర్వహిస్తున్న సాహు బదిలీపై ఇక్కడకు వచ్చారు. చందిలి ఐఐసీగా విధులు నిర్వహించిన ప్రసన్న బెహరకు రాయగడ బదిలీ అయింది. బాధ్యతలు చేపట్టిన ఐఐసీ సాహుకు చందిలి పోలీస్ స్టేషన్ సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికి అభినందించారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై చర్చ

జయపురం: జయపురం సబ్‌డివిజన్ కోట్‌పాడ్‌లో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌సెల్‌లో పాల్గొనేందుకు వచ్చిన కొరాపుట్ జిల్లా కలెక్టర్ వి.కీర్తివాసన్, జయపురం సబ్‌కలెక్టర్ కుమారి అక్కవరం శొశ్యా రెడ్డిలు వినతుల స్వీకరణ అనంతరం ఘుమర, బొబాయి, కుసుమి, కొట్‌పాడ్‌లలో ఏర్పాటు చేయనున్న మార్కెట్ యార్డ్‌లను సందర్శించి పరిశీలించారు. ఆయా ప్రాంతాలలో రోడ్లపై ఆరబెట్టిన ధాన్యాన్ని పరిశీలించారు. అనంతరం కోట్‌పాడ్ బీడీవో, ఇతర అధికారులతో మండీల నిర్వహణపై చర్చించారు. కాగా గ్రీవెన్స్‌సెల్‌కు 120 వినతులు వచ్చాయి. వీటిలో 30 వ్యక్తిగతం కాగా 90 గ్రామ సమస్యలపై ఉన్నట్టు అధికారులు వెల్లడించారు. సీడీవో బేణాధర శబర, సీడీఎంవో రవీంద్ర నారాయణ మిశ్ర, తహసీల్దార్ ట్వింకిల్ సెట్టి, బడీవో సంధ్యా సమరత్ పాల్గొన్నారు.

చేయి చేయి కలిపి రోడ్డు నిర్మించి..

- ఆదర్శంగా నిలిచిన జంగపాడు గ్రామస్తులు
- రెండురోజుల్లో నాలుగు కిలోమీటర్ల రోడ్డును నిర్మించుకున్న వైనం



శ్రమదానంతో రహదారిని నిర్మించుకుంటున్న గ్రామస్తులు

రాయగడ: జిల్లాలోని బిసంకటక్ సమితి జంగపాడు గ్రామస్తులు ఆదర్శంగా నిలిచారు. చేయి చేయి కలిపి శ్రమదానంతో ఏకంగా రోడ్డును నిర్మించుకొని కష్టాలను తీర్చుకున్నారు. ఈ గ్రామానికి సరైన రహదారి లేకపోవడంతో గ్రామస్తులు ఇబ్బందులు పడేవారు. దీంతో శ్రమదానం చేసి రోడ్డు నిర్మించుకోవాలని భావించి ఆలోచనను ఆచరణలో చేసి చూపించారు. రెండేళ్ల క్రితం సమితిలోని చాటికొన నుంచి పది కిలోమీటర్ల దూరంలో గల జంగపాడు గ్రామానికి రహదారి నిర్మించేందుకు సంబంధిత శాఖ టెండర్లను ఆహ్వానించింది. టెండరు ప్రక్రియ పూర్తయినప్పటికీ ఇంతవరకు నిర్మాణం పనులు చేపట్టలేదు. అత్యవసర పరిస్థితిలో రాకపోకలకు చాలా కష్టంగా మారింది. రోడ్డు నిర్మాణం చేపట్టాలని ప్రజలు అధికారుల చుట్టూ కాళ్లరిగేలా తిరిగినా ఫలితం లేకపోవడంతో శ్రమదానం చేసుకుని మట్టి రోడ్డును నిర్మించుకున్నారు. చిన్నా,పెద్ద అంతా తలో చేయి వేసి పనులను పూర్తి చేసుకున్నారు. రెండు రోజుల్లో సుమారు నాలుగు కిలోమీటర్ల దూరం పొడువున రహదారిని నిర్మించుకున్న గ్రామస్తులు సోమవారం నాటికి పూర్తిస్థాయి రహదారిని ఏర్పాటు చేసుకున్నారు. అయితే వచ్చేది వర్షాకాలం కావడంతో మట్టితో నిర్మించుకున్న రహదారి కొట్టుకుపోతే పరిస్థితి యథాస్థితికి చేరుతుందని ఆందోళన చెందుతున్ననుర. ఏదిఏమైప్పటికీ ప్రస్తుతం వాహన రాకపోకలకు మార్గం సుగమమం కావడంతో ఆనందిస్తున్నారు. అధికారులు ఇప్పటికైన స్పందించి పూర్తి స్థాయిలో రోడ్డు నిర్మాణం పనులు చేపట్టాలని ప్రజలు వేడుకుంటున్నారు.

రోజ్జో సంక్రాంతి పండక్కి డ్యాన్స్ ఆడిషన్లు



రోజో తారక్ పోటీలో పాల్గొన్న చిన్నారి

పర్లాకిమిడి: ఉత్తర ఒడిశా వాసులకు అత్యంత ప్రీతిపాత్రమైన రోజ్జో పండుగ కోసం స్థానిక టౌనుహాలులో 'రోజోరో తారక్' అనే కార్యక్రమాన్ని స్రుజని సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం నిర్వహించారు. పోటీలో ఎంపిక చేసిన కళాకారులను రోజ్జో సంక్రాంతి సందర్భంగా భువనేశ్వర్‌లో జూన్16న ఫైనల్స్‌ను నిర్వహించి బహుమతి ప్రదానం చేస్తామని కొరియాగ్రాఫర్ డి.కుల్‌దీప్ తెలియజేశారు. ఈ డ్యాన్స్ పోటీలకు న్యాయ నిర్ణేతలుగా మమతా పాఢి, మనోజ్ పాఢి, కుల్ దీప్ తదితరులు వ్యవహరించారు.

విజిలెన్స్ వలలో ఇద్దరు మహిళా ఇంజినీర్లు



సుచిస్మితా పరజా



సుస్మితా ఓరం

కొరాపుట్: రాష్ట్రంలో వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన ఘటనల్లో ఇద్దరు ప్రభుత్వ మహిళా ఇంజినీర్లు విజిలెన్స్ వలకు చిక్కారు. మంగళ వారం కొరాపుట్ జిల్లా లమ్తాపుట్ సమితిలో అసిస్టెంట్ ఇంజినీర్ సుచిస్మిత పరజా రూ.8 వేలు లంచం తీసుకొంటుండగా రెడ్ హ్యాండెడ్‌గా దొరికిపోయారు. ఘాట్ రోడ్డు లో కటింగ్ పనులు చేసిన కాంట్రాక్టర్‌ను లంచం అడగడంతో ఆయన విజిలెన్స్‌ను సంప్రదించగా మాటు వేసి పట్టుకున్నారు. మరో వైపు బరగడ్ జిల్లా గయిసిలేట్ సమితి లో జూనియర్ ఇంజినీర్ సుస్మితా ఓరం మంగళ వారం విజిలెన్స్ వలకు చిక్కారు. బిల్లులు విడుదల చేయడానికి కాంట్రాక్టర్ వద్ద నుంచి 10 శాతం కమిషన్ కావాలన్నారు. అందుకు తక్షణం రూ.32,000 ఇవ్వాలని డిమాండ్ చేశారు. దాంతో కాంట్రాక్టర్ విజిలెన్స్ విభాగానికి ఫిర్యాదు చేయగా వారిచ్చిన రూ.8 వేలు తీసుకుంటూ ఉండగా అధికారులు పట్టుకున్నారు.

దారి కాచిన మృత్యువు

- రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతి
- మృతులంతా ఒడిశా వాసులే



ప్రమాదానికి గురైన బొలేరో వాహనం



ప్రమాదానికి కారణమైన లగేజీ వ్యాన్



ప్రమాదంలో మృతి చెందిన డ్రైవర్ గోకుల్ పండా



ప్రమాదంలో మృతిచెందిన సుశాంత్‌కుమార్ సబత్

టెక్కలి రూరల్: దైవ దర్శనానికి బయల్దేరిన వారికి చావు ఎదురైంది. కోటబొమ్మాళి మండలం ఎత్తురాళ్లపాడు జంక్షన్ వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు ఒడిశా వాసులు మృతిచెందారు. సింహాచలం అప్పన్న దర్శనానికి బయల్దేరగా.. కోటబొమ్మాళి మండలం వద్ద ప్రయాణం ముగిసిపోయింది. ఒడిశా రాష్ట్రం బ్రహ్మపురం రాధాకృష్ణ వీధికి చెందిన కొందరు బొలేరో వాహనంపై తమ గ్రామం నుంచి సింహాచలం దైవ దర్శనానికి బయల్దేరారు. కోటబొమ్మాళి మండలం ఎత్తురాళ్లపాడు వద్దకు వచ్చే సరికి వాహనం రోడ్డుపక్కన ఆపి కిందకు దిగుతుండగా.. వెనుక నుంచి అతివేగంగా వచ్చిన లగేజీ బొలేరో వ్యాన్ వీరిని అమాంతం ఢీకొట్టింది. బొలేరో వాహనంలో ఉన్న ఒడిశాకు చెందిన 8 మంది వ్యక్తులు అందులో ఉండగా.. ఈ ప్రమాదంలో డ్రైవర్ గోకుల్ పండా(33), సుశాంత్ కుమార్ సబత్(44) అతని కుమార్తె సంతోషి సబత్(7) అక్కడికక్కడే మృతిచెందారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ప్రమాదానికి కారణమైన లాగేజ్ వ్యాన్ డ్రైవర్ అక్కడి నుంచి పరారైనట్లు స్థానికులు తెలిపారు. ఘటనపై నందిగాం ఎస్ఐ మహ్మద్ ఆలీ కేసుమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

క్లుప్తంగా

సాక్షి కార్యాలయం ధ్వంసంపై ఎస్పీకి ఫిర్యాదు

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లాలోని ఎచ్చెర్ల కేంద్రంగా ఉన్న 'సాక్షి' పత్రికా ప్రధాన కార్యాలయంపై ఈ నెల 9న కొంతమంది టీడీపీ నాయకులు, వారి మద్దతుదారులు దాడికి పాల్పడ్డారు. ఘటనపై ఫిర్యాదు ఇచ్చేందుకు మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డిని సాక్షి బ్రాంచ్ మేనేజర్ జేజీవీ ఆర్ స్వామిబెహరా, జిల్లా బ్యూరో చీఫ్ కందుల శివశంకర్ మరికొంతమంది మీడియా ప్రతినిధులు కలిశారు. కార్యాలయంపై దాడి జరిగిన తీరును ఎస్పీకి వివరించారు. దాడికి పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఎస్పీని కలిసిన వారిలో సాక్షి టీవీ బ్యూరో సునీల్‌కుమార్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు బాలు, వాసు, సాక్షి క్రైమ్ రిపోర్టర్ నరసింహ ఉన్నారు.

పీజీ నాలుగో సెమిస్టర్ ఫలితాలు విడుదల

ఎచ్చెర్ల : డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ విశ్వవిద్యాలయం, అనుబంధ పీజీ కళాశాలల్లో పోస్టు గ్రాడ్యుయేషన్ నాలుగో సెమిస్టర్ ఫలితాలను ఎగ్జామినేషన్ డీన్ డాక్టర్ ఎస్.ఉదయభాస్కర్ మంగళవారం విడుదల చేశారు. 19 కోర్సుల్లో 498 మంది పరీక్షలు రాయగా అందులో 426 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఫలితాలను జ్ఞానభూమి పోర్టల్, వర్సిటీ వెబ్‌సైట్ అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. సందేహాలుంటే 15 రోజుల్లోగా రీ వాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

కేంద్రీయ విద్యాలయంలో ప్రవేశాలకు ఆహ్వానం

శ్రీకాకుళం రూరల్: శ్రీకాకుళం (పెదపాడు)లోని పీఎం కేంద్రీయ విద్యాలయంలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ బండి లవకుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 4వ తరగతిలో ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు మాత్రమే సీట్లు ఉన్నాయని, 8, 9, 10వ తరగతులతో పాటు ఇంటర్మీడియట్‌లో కేటగిరి 1, 2 అభ్యర్థులకు మాత్రమే (సీబీఎస్‌ఈ అఫిలియేటెడ్‌లో చదివిన వారికి) ప్రవేశం కల్పిస్తామని పేర్కొన్నారు. ఆసక్తి గల వారు జూన్ 16లోగా దరఖాస్తులు చేసుకోవాలని, పూర్తి వివరాలకు పెదపాడు కేంద్రీయ విద్యాలయంలో సంప్రదించాలని కోరారు.

హత్యాయత్నం కేసులో నాలుగేళ్ల జైలుశిక్ష

సోంపేట : బారువ గ్రామానికి చెందిన తెప్పల కృష్ణారావు 2016 జూలై 26న మరొక వ్యక్తితో కలిసి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా అదే గ్రామానికి చెందిన నాయని యోగేశ్వరరావు వ్యక్తిగత కక్షలతో కత్తితో దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటనలో కృష్ణారావుకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటనలో కేసు నమోదు కాగా, పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈ కేసులో ముద్దాయి యోగేశ్వరరావు నేరం చేసినట్లు రుజువు కావడంతో నాలుగేళ్ల జైలుశిక్ష పడినట్లు సోంపేట సీఐ బి.మంగరాజు మంగళవారం తెలిపారు.

లారీని ఢీకొన్న కారు



దెబ్బతిన్న కారు

ఎచ్చెర్ల: లావేరు మండలం బుడుమూరు వద్ద జాతీయ రహదారిపై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు స్వల్పంగా గాయపడ్డారు. విశాఖపట్నం నుంచి శ్రీకాకుళం వైపు వెళ్తున్న కారు ముందు వెళ్తున్న లారీని ఢీకొట్టడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. లావేరు పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

అరసవల్లి ఈఓగా కేఎన్‌వీడీ ప్రసాద్



కెఎన్‌విడి ప్రసాద్, ఈవో

అరసవల్లి: అరసవల్లి శ్రీసూర్యనారాయణ స్వామి ఆలయానికి కొత్త ఈఓ (డిప్యూటీ కమిషనర్)గా కేఎన్‌వీడీ ప్రసాద్‌ను నియమిస్తూ మంగళవారం దేవదాయ శాఖ రాష్ట్ర కమిషనర్ రామచంద్రమోహన్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈయన ఇంతవరకు విజయనగరం మాన్సాస్ ట్రస్ట్ ఈఓగా పనిచేస్తూ అరసవల్లికి బదిలీ అయ్యారు. అక్కడ కూడా ఎఫ్ఏసీగా బాధ్యతలు కొనసాగించనున్నారు. కాగా ఇంతవరకు అరసవల్లి ఈఓగా పనిచేసిన వై.భద్రాజీని ఏలూరు జిల్లా ద్వారకా తిరుమల వేంకటేశ్వర స్వామి వారి ఆలయ డిప్యూటీ ఈఓగా బదిలీ చేశారు. భద్రాజీ హయాంలోనే ఆలయ పరిసరాల్లో కూల్చివేతలు జరిగాయి. అయితే తర్వాతి పరిణామాల్లో ఈయన వ్యవహార శైలిపై అసంతృప్తి వ్యక్తం చేసిన స్థానిక కూటమి ప్రభుత్వ పెద్దలే ఈయన్ను బదిలీపై వెళ్లిపోవాలని ఒత్తిడి తీసుకువచ్చినట్లు సమాచారం.

ఇద్దరు ఈఓలకు బదిలీ

జిల్లా దేవదాయ శాఖ పరిధిలో గ్రేడ్-2 ఈఓలుగా పాతపట్నం గ్రూప్ టెంపుల్స్‌లో పనిచేస్తున్న టి.వాసుదేవరావును పలాస గ్రూప్ టెంపుల్స్‌నకు, అలాగే పలాస గ్రూప్ టెంపుల్స్‌లో ఈఓగా పనిచేస్తున్న జి.గురునాధరావుకు టెక్కలి రావివలస ఎండల మల్లికార్జున స్వామి వారి ఆలయానికి బదిలీ చేశారు.

ధాన్యం కొనుగోలు చేయాలి



జాముండలో ధాన్యం మండీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బాహిణీపతి

జయపురం: మండీలకు రైతులు తీసుకువచ్చే ధాన్యంపై అభ్యంతరాలు చెప్పటం మాని, ధాన్యం కొనుగోలు చేయాలని ప్రొక్యూర్‌మెంట్ సంస్థలకు, అధికారులకు జయపురం ఎమ్మెల్యే తారా ప్రసాద్ బాహిణీపతి విజ్ఞప్తి చేశారు. జయపురం సమితి జాముండ, కుములిపుట్‌లలో ఏర్పాటు చేసిన మండీలను సందర్శించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. మండీలకు సంబంధిత అధికారులు, ధాన్యం కొనుగోలుదారులు సకాలంలో రావాలని విజ్ఞప్తి చేశారు. రైతులను ఎవరు ఇబ్బంది పెట్టినా, కష్టం కలిగించినా క్షమించేది లేదని హెచ్చరించారు. జిల్లాలో మండీలు సక్రమంగా నిర్వహించటం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయన్నారు. మండీలలో ధాన్య కొనేందుకు వస్తున్న కలహండీ జిల్లా మిల్లర్లు రైతులను ఇబ్బందులు పెడుతున్నారని, మండీలు తెరచినా మిల్లర్లు సకాలంలో రావటం లేదన్న ఆరోపణలు వచ్చాయన్నారు. కలహండీ మిల్లర్లు ఎక్కడ ధాన్యం కొన్నా నాణ్యత లేవని అభ్యంతరం తెలుపుతూ క్వింటాకు 8 నుంచి 10 కేజీల ధాన్యం అదనంగా తీసుకుంటున్నారని, తమకు తెలిసిందన్నారు. బీజేపీ ప్రభుత్వం ఎటువంటి కటింగ్‌లు లేకుండా ధాన్యం కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చిందని, నేడు అందుకు భిన్నంగా జరుగుతుందన్నారు. గతంలో కన్నా ఎక్కవ ఆంక్షలు విధించటం తగదన్నారు. మిల్లర్లతో ఫోన్‌లో మాట్లాడి రైతులను ఇబ్బంది పెట్టవద్దన్నారు. ముందుగా నిర్ణయించిన ప్రకారం మిల్లర్లు రైతుల నుంచి ధాన్యం కొనాలని ఆదేశించారు. ఆదేశాలను అమలు చేయకపోతే తగు చర్యలు తీసుకోవాలని తాము రాష్ట్ర ప్రభుత్వానికి కోరతానన్నారు. రైతులకు ఎటువంటి నష్టం కలిగినా సహించేది లేదన్నారు. జాముండ మండీలో మార్కెట్ యార్డును ప్రారంభించారు.



జాముండలో మార్కెట్ యార్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బాహిణీపతి



బాహిణీపతికి సంప్రదాయ నృత్యాలతో స్వాగతిస్తున్న దృశ్యం

ఇద్దరు అరెస్ట్



నవీణ ఖోశ్ల



కిశోర్ కులదీప్

జయపురం: యువకునిపై దాడి చేసిన ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు జయపురం సదర్ పోలీసు అధికారి సచిన్ ప్రధాన్ మంగళవారం తెలిపారు. అరెస్టు అయిన వారు జయపురం సమితి గొడాపాదర్ పంచాయతీ కొలాగుడ గ్రామం నవీణ ఖోశ్ల (32), కిశోర్ కుమార్ కులదీప్(31) అని వెల్లడించారు. ఇద్దరిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరచామని, వారికి బెయిలు మంజూరు కాకపోవటం వలన వారిని జైలుకు తరలించినట్లు తెలిపారు. ఈ నెల 7వ తేదీన బొడొపాదర్‌లో జరిగిన బిరిపాణి జాతరలో ఇద్దరు యువకులు అల్లర్లు చేసి హంగామా సృష్టించారు. వారికి గొడాపాదర్ పెంటియ సాహిలో ప్రదీప్ కుమార్ రాయ్(34) అడ్డు చెప్పాడు. తరువాత రాయ్ ఇంటికి వెళ్లి పోయాడు. మరునాడు ఉదయం ఆ ఇరువురు ప్రదీప్ రాయ్ ఇంటికి వెళ్లి చంపుతామని హెచ్చరించి, కత్తితో దాడి చేశారు. రాయ్ నడుముపై పెద్ద గాయమైంది. రాయ్‌ను కత్తితో పొడిచిన దుండగులు పరారీ అయ్యారు. రాయ్ కుటుంబ సభ్యులు జిల్లా కేంద్ర హాస్పిటల్‌లో చేర్చారు. బరిణిపుట్ పోలీసు సంటి అధికారి ఏఎస్ఐ సుశాంత్ దలపతి కేసు దర్యాప్తు చేసి నిందితులను అరెస్టు చేసినట్లు వెల్లడించారు.

రూ.25 లక్షల పరిహారం అందజేయాలి

జయపురం: కొరాపుట్ సహిద్ లక్ష్మణ నాయిక్ వైద్య కళాశాల హాస్పిటల్‌లో ఇటీవల తప్పుడు ఇంజక్షన్‌తో మరణించిన ఆరుగురు వ్యక్తుల కుటుంబాలకు రూ.25 లక్షల చొప్పున పరిహారం చెల్లించాలని సోషలిస్టు యూనిటీ సెంటర్ ఆఫ్ ఇండియా కమ్యూనిస్టు పార్టీ బొయిపరిగుడ శాఖ డిమాండ్ చేసింది. మంగళవారం ఆ పార్టీ బొయిపరిగుడ బ్లాక్ కార్యదర్శి సూర్యనారాయణ బిశాయి జిల్లా ప్రధాన వైద్యాధికారికి రాసిన 4 డిమాండ్లతో ఉన్న లేఖను బొయిపరిగుడ కమ్యూనిటీ హాస్పిటల్ వైద్యాధికారికి అందజేశారు. ఆరుగురు మరణానికి కారకులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆ పార్టీ డిమాండ్ చేసింది. వైద్యుల నిర్లక్ష్యం వలన మరణాలు సంభవించాయని ఆరోపించింది. మరణించిన వారి కుటుంబాలకు పరిహారం చెల్లించటంతోపాటు తప్పుడు ఇంజక్షన్ ఇచ్చిన డాక్టర్‌కు కఠిన శిక్ష విధించాలని, సహిద్ లక్ష్మణ నాయిక్ వైద్య కళాశాల హాస్పిటల్, జిల్లా కేంద్ర హాస్పిటల్‌లో అగినంత మంది డాక్టర్లతోపాటు వైద్య సిబ్బందిని నియమించాలని, ఖాళీలు ఉన్న పదవులను వెంటనే భర్తీ చేయాలని, అత్యాధునిక వైద్య పరికరాలతోపాటు ప్రాణ రక్షక ఔషధాలను రోగులకు సమకూర్చాలని ఆ లేఖలో పేర్కొన్నారు. ఆ పార్టీ కార్యకర్తలు లక్ష్మీమీ బారిక్, దశరథ ఖిలో, నవీన బారిక్, తదితరులు పాల్గొన్నారు.



డిమాండ్ పత్రాన్ని, వైద్యాధికారికి అందజేస్తున్న బిశాయి, తదితరులు

శ్రీముఖలింగంలో మైనాకోత్సవం



మైనాకోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

జలుమూరు: ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీముఖలింగంలో పాంచరాత్రి కల్యాణ ఉత్సవాల్లో భాగంగా జ్యేష్ఠ మాసం ఐదో బుధవారం స్వామివారికి మైనాకోత్సవం ఘనంగా జరిగింది. గణపతి పూజతో ప్రారంభించి స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దీనికి ముందుగా హోమం బలిహరణ అనంతరం పార్వతీ పరమేశ్వరులకు తిరువీధి ఉత్సవం నిర్వహించారు. అదే సమయంలో పార్వతీపరమేశ్వరుల వివాహ మహోత్సవం నచ్చని మైనాకుడు స్వామి గృహాన్ని దహనం చేస్తాడు. ఈ కార్యక్రమాన్ని మైనాకోత్సవంగా నిర్వహించడం సంప్రదాయం. ఈ కార్యక్రమంలో అర్చకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

భర్త ఇంటి ముందు భార్య నిరసన



భర్త ఇంటి ముందు కుమారుడితో నిరసన వ్యక్తం చేస్తున్న భార్య మంజుశ్రీ

శ్రీకాకుళం క్రైమ్ : కట్టుకున్న భర్తే రోడ్డుపై గెంటేశాడని.. కోర్టులో విడాకులు మంజూరు కాకుండానే వేరే మహిళను వివాహం చేసుకున్నాడని.. ఆ ఇంట్లో వెళ్లి ఉండాలని పోలీసులు చెప్పినా తనను రానీయకుండా అడ్డుపడుతున్నాడంటూ దొండపాటి మంజుశ్రీ అనే వివాహిత వాపోయారు. ఈ మేరకు మంగళవారం బలగలో తన భర్త ఇంటి ముందు నిరసన వ్యక్తం చేశారు.. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బలగకు చెందిన దొండపాటి విశ్వనాథం, దమయంతిల కుమారుడు ఉమానవీన్‌కుమార్‌తో 2012 ఆగస్టులో తనకు వివాహం జరిగిందని, కొన్ని నెలలకే అదనపు కట్నంకోసం అత్తింటి వేధింపులు మొదలయ్యాయని చెప్పారు. బాబు పుట్టాక ఇంటి నుంచి గెంటేయడంతో కాకినాడలో ఉన్న తల్లి వద్దకు చేరానని, 2014 జనవరిలో సర్పవరం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశానని తెలిపారు. అనంతరం కోర్టును ఆశ్రయించానని చెప్పారు. 2018లో మెయింటెనెన్సు కేసు తనకు ఫేవర్ వచ్చిందని, అయినా డబ్బులు తక్కువగా ఇస్తూ, విడాకులైనా తీసుకోకుండా.. మరొక మహిళను పెళ్లి చేసుకున్నాడని తెలిపారు. ఇటీవల ఎస్పీ మహేశ్వరరెడ్డిని కలవగా సీఐ ఈశ్వరరావు ద్వారా విచారణ నివేదిక కాగితం ఇచ్చారని, దానిని పట్టుకుని మంగళవారం బలగలోని తన భర్త ఉంటున్న నివాసం వద్దకు చేరితే మెడ పట్టుకుని కొడుకుతో సహా తనను గెంటేశారని వాపోయారు.

వైఎస్ జగన్‌ను కలిసిన నాయకులు



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో పిరియా విజయ, సాయిరాజ్



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో మార్పు దుర్గాపృథ్వీరాజ్

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం శ్రీకాకుళం జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, సాయిరాజ్ దంపతులు మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా జిల్లాలో పార్టీ పరిస్థితుల్ని వివరించారు. అదే విధంగా విధంగా, వైఎస్సార్‌సీపీ జిల్లా యువజన అధ్యక్షుడు మార్పు దుర్గాపృథ్వీరాజ్ కూడా జగన్‌మోహన్‌రెడ్డిని కలిశారు. జిల్లా కేంద్రంతో పాటు అన్ని నియోజకవర్గాల్లో ఇటీవల జరిగిన వెన్నుపోటు దినం కార్యక్రమం విజయవంతమైందని పృథ్వీరాజ్ తెలియజేశారు. - కవిటి/గార

అ'పూర్వ' సమ్మేళనం



పోలాకి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1997-98 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు మంగళవారం అదే పాఠశాలలో అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. ఆనాటి జ్ఞాపకాలను ఒకరితో ఒకరు పంచుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను పిలిచి సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ఎంవీఏ నాయుడు, కూసెట్టి శ్రీను, గంగేటి సురేష్, మిరియాపల్లి వెంకట అప్పలనాయుడు, బరాటం ప్రసాద్, బరాటం సుమన్, పెద్దాడ వెంకట్, బచ్చు అప్పన్న, ఇప్పిలి ముద్దులు తదితరులు పాల్గొన్నారు. - పోలాకి

మీడియాపై దాడులు నశించాలి



టెక్కలిలో నిరసన చేస్తున్న మీడియా ప్రతినిధులు

టెక్కలి : 'రాష్ట్రంలో మీడియాపై దాడులు నశించాలి.. సాక్షి కార్యాలయాలపై దాడులు అరికట్టాలి.. సీనియర్ జర్నలిస్టు కొమ్మినేని అక్రమ అరెస్టు ఖండించాలి..' అంటూ టెక్కలిలో ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. ఏపీయూడబ్ల్యూజే కౌన్సిల్ సభ్యుడు బెండి నరసింగరావు ఆధ్వర్యంలో టెక్కలి అంబేడ్కర్ జంక్షన్‌లో ప్లకార్డులతో నిరసన చేపట్టారు. అనంతరం రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ విగ్రహానికి నిరసన ప్రతులను అందజేశారు. ఈ సందర్భంగా నరసింగరావు మాట్లాడుతూ...మీడియా సంస్థలు, జర్నలిస్టులు ప్రజల పక్షాన అక్షరమే ఆయుధంగా పోరాటాలు చేస్తుంటారని, ఈ క్రమంలో రాజకీయంగా వేధింపులు సరికాదని అన్నారు. ఎన్నో ప్రయాసలతో జర్నలిస్టులు ప్రజల కోసం సామాజికంగా పనిచేస్తున్నారని, అటువంటి జర్నలిస్టులు, మీడియా సంస్థలపై దాడులు చేయడం మంచిది కాదన్నారు.

యువతిని మోసగించిన యువకుడిపై కేసు

శ్రీకాకుళం రూరల్: పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేసిన యువకుడిపై బాధిత యువతి పోలీసులకు ఫిర్యాదు చేసింది. శ్రీకాకుళం రూరల్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. రేగిడి మండలం అంబాడ గ్రామానికి చెందిన దళిత యువతి, పాలకొండ మండలం రాజుపేటకు చెందిన రౌతు వెంకటేష్ జిల్లా కేంద్రం సమీపంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో పనిచేసేవారు. కులాలు వేరైనా ప్రేమిస్తున్నానంటూ వెంటపడటంతో యువతి సరేనంది. ఈ క్రమంలో పెళ్లి చేసుకోవాలని యువతి కోరగా కాలయాపన చేస్తూ తప్పించుకుంటున్నాడంటూ రేగిడి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు ఇచ్చింది. ప్రస్తుతం గర్భవతిగా ఉన్నానని, పెళ్లి చేసుకోమంటే కులం పేరుతో దూషిస్తున్నాడంటూ ఫిర్యాదులో పేర్కొంది. ఫిర్యాదు కాపీ శ్రీకాకుళం రూరల్ పోలీస్‌స్టేషన్‌కు చేరగా.. ఎస్ఐ రాము మంగళవారం కేసు నమోదు చేశారు.

యువతి ఆత్మహత్య



తోనంగి సునీత (ఫైల్)

మెళియాపుట్టి: సిరియాకండి గ్రామానికి చెందిన తోనంగి సునీత(19) అనే యువతి నేలబావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. మెళియాపుట్టి పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. సునీత శ్రీకాకుళంలోని నారాయణ పారామెడికల్ ఇన్‌స్టిట్యూట్‌లో ల్యాబ్ టెక్నీషియన్ కోర్సు చదువుతోంది. అక్కడే ఓ గదిలో నలుగురు స్నేహితురాళ్లతో కలిసి అద్దెకు ఉంటోంది. 40 రోజుల కిందట వేసవి సెలవుల కోసం గ్రామానికి వచ్చింది. ఈ క్రమంలో సోమవారం సాయంత్రం నుంచి కుమార్తె కనిపించపోవడంతో మృతురాలి తండ్రి ప్రసాదరావు అన్నిచోట్లా వెతికారు. మంగళవారం గ్రామానికి దూరంగా ఉన్న నేలబావిలో మృతదేహం తేలడంతో నిర్ఘాంతపోయారు.తండ్రి ప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పాతపట్నం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రేమవ్యవహారం గానీ, ఆరోగ్య సమస్యలు ఉండొచ్చని అనుమానిస్తున్నట్లు ఎస్సై రమేష్‌బాబు తెలిపారు.

శాశ్వత లోక్ అదాలత్‌తో బీఎడ్ అభ్యర్థికి న్యాయం

శ్రీకాకుళం పాతబస్టాండ్: తన సమస్య పరిష్కారం కోరుతూ శాశ్వత లోక్ అదాలత్‌ను ఆశ్రయించిన బీఈడీ చదివిన అభ్యర్థికి ఎట్టకేలకు న్యాయం జరిగింది. శ్రీకాకుళం మండలం వాకలవలసకు చెందిన కూన హరిప్రసాద్ ఎచ్చెర్లలోని డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో ప్రత్యేక బీఎడ్ కోర్సు పూర్తి చేశాడు. ఒరిజినల్ సర్టిఫికెట్ (ఓడీ), మార్క్‌షీట్ అందించాని 2022లో యూనివర్సిటీ అధికారులకు చలానా, ఇతర వివరాలను అందజేస్తూ దరఖాస్తు చేసుకున్నాడు. మూడేళ్లు గడిచినా పట్టించుకోలేదు. దీంతో హరిప్రసాద్ జిల్లా కోర్టు ఆవరణలోని శాశ్వత లోక్ అదాలత్‌ను ఆశ్రయించాడు. చైర్మన్ జి.జ్ఞానసువర్ణ రాజు విచారణ చేపట్టి అధికారులకు నోటీసులు జారీ చేశారు. ఈ మేరకు మంగళవారం వర్సిటీ అధికారులు హాజరై పత్రాలు అందించారు.

4 నెలల్లో 505 ఫోన్లు రికవరీ



యువతికి ఫోన్ అప్పగిస్తున్న ఎస్పీ

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లాలో గడిచిన నాలుగు నెలల్లో బాధితులు పోగొట్టుకున్న రూ. 80 లక్షల విలువ చేసే 505 మొబైల్ ఫోన్లను కనిపెట్టి బాధితులకు అందజేస్తున్నామని, మరో 300 నుంచి 400 వరకు కనిపెట్టేందుకు సైబర్ సెల్ బృందం కృషి చేస్తోందని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి అన్నారు. పోగొట్టుకున్న మొబైళ్లను పొందేందుకు బాధితులు చేయాల్సిందల్లా గోల్డెన్ అవర్‌లో సీఈఐఆర్ పోర్టల్‌లో రిజిస్టరై ఫిర్యాదు చేయడమేనన్నారు. మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన పత్రికా సమావేశంలో ఎస్పీ మాట్లాడారు.

సీఈఐఆర్ పోర్టల్‌లో రిజిస్టరవ్వాలి..

ఫోన్లను పోగొట్టుకున్న బాధితులు ముందుగా సిఈఐఆర్ (సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్) పోర్టల్, హెచ్‌టీటీపీఎస్://డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.సిఇఐఆర్.జిఒవి.ఐఎన్ అనే పబ్లిక్ వెబ్‌సైట్‌లో బ్లాకింగ్ అభ్యర్థన ద్వారా రిజిస్టర్ చేసుకోవాలన్నారు. ఫిర్యాదు ఆధారంగా మొబైల్ ఐఎంఈఐ నంబర్లు బ్లాక్ అయ్యాక ఆ రిక్వెస్ట్‌ను సైబర్‌సెల్ పోలీసులు రిసీవ్ చేసుకుని మొబైల్‌ను ట్రాక్ చేస్తారన్నారు. రికవరీ అయ్యాక మొబైల్‌ను అన్‌బ్లాక్ చేసి పోగొట్టుకున్న వ్యక్తికి అందజేస్తున్నామన్నారు. ఫోన్లు వాడే ప్రతి ఒక్కరూ ఫోన్‌లోనే సెక్యూరిటీ లాక్ వేసుకోవాలన్నారు.

ప్రతిభకు ప్రశంసలు..

దూర ప్రాంతాలకు తరలిపోయిన ఫోన్లతో పాటు, అతి విలువైన మొబైళ్లను అతి తక్కువ కాలంలో అదనపు ఎస్పీ (అడ్మిన్) పర్యవేక్షణలో ఛేదించిన సైబర్, ఐటీ కోర్ సెల్ సీఐ టి.శ్రీను, సైబర్ నిపుణులు పైల చక్రధర్ (చక్రి), గిరి, సుధీర్, సీసీఎస్ సీఐ చంద్రమౌళి, సిబ్బందిని ఎస్పీ ప్రత్యేకంగా ప్రశంసించారు.

ఆదిత్యాలయానికి కొత్త ఉద్యోగులు

- సూపరింటెండెంట్‌గా సునీల్‌కుమార్
- మరో ఇద్దరు అసిస్టెంట్లు సైతం రాక

అరసవల్లి: దేవదాయ శాఖ బదిలీల ప్రక్రియలో భాగంగా అరసవల్లి సూర్యనారాయణ స్వామి వారి ఆలయంలో తొలిసారిగా రెండో సూపరింటెండెంట్ పోస్టు కేటాయింపు జరిగింది. ఇంతవరకు ఈ ఆలయానికి ఒకే పోస్టు ఉండగా..తాజాగా బదిలీల్లో సింహాచలం దేవస్థానం నుంచి పి.సునీల్ కుమార్‌ను అరసవల్లి ఆలయానికి బదిలీ చేస్తూ రాష్ట్ర కమిషనర్ రామచంద్రమోహన్ ఉత్తర్వులు జారీ చేశారు. సింహాచలం దేవస్థానంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న డి.వెంకటరమణ, జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న బాలభాస్కర సాయిలను కూడా అరసవల్లి ఆలయానికి బదిలీ చేశారు. విజయనగరం జిల్లా మాన్సాస్ ట్రస్ట్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న బి.ఎస్.చక్రవర్తిని అరసవల్లికి, ఇక్కడ జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఎం.కావ్యశ్రీని విజయనగరం మాన్సాస్‌కు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. తాజా మార్పులతో ఆదిత్యాలయంలో ఇద్దరు సూపరింటెండెంట్లు, ముగ్గురు సీనియర్ అసిస్టెంట్లు, ఇద్దరు జూనియర్ అసిస్టెంట్లు విధుల్లో ఉండనున్నారు. డిప్యూటీ కమిషనర్ హోదా పొందిన తర్వాత దాదాపుగా పూర్తిస్థాయి క్యాడర్‌తో అరసవల్లి దేవస్థానంలో ఉద్యోగులు విధుల్లో ఉండనున్నారు. అయితే దాదాపుగా అందరూ సింహాచలం వంటి పెద్ద దేవస్థానాల నుంచి వచ్చిన వారే కావడంతో జీతాల స్థాయిని బట్టి చూస్తే.. స్థానికంగా ఆలయ ఆదాయానికి పెద్ద గండి పడినట్లయ్యింది. వీరి జీతభత్యాలను ఆలయ ఆదాయం నుంచే రూ.లక్షల్లో చెల్లించాల్సి ఉంటుంది.

బంగారం కోసం వచ్చి.. ప్రాణాలు తీసి



దాలమ్మ మృతదేహం

టెక్కలి రూరల్: కోటబొమ్మాళి మండలం పెద్ద హరిచంద్రపురం గ్రామంలో మంగళవారం దుంపల దాలమ్మ(68) అనే వృద్ధురాలిని హత్య చేశారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం.. దాలమ్మ తన ఇంటిలో ఒంటరిగా నివసిస్తున్నారు. పిల్లలు విశాఖపట్నంలో ఉంటున్నారు. దాలమ్మ భర్తకు ఆరోగ్యం సరిగా లేకపోవడంతో ఆయన కుమారుడి వద్ద ఉంటున్నారు. రోజూ మాదిరిగానే మంగళవారం ఉదయం 3గంటల సమయంలో ఆమె నిద్ర లేచి పనులు చేసుకుంటూ ఉండగా.. ఇంటి పెరటి నుంచి గుర్తు తెలియని వ్యక్తి వచ్చి ఆమె మెడలో తాడు లాగబోయాడు. ఆ ప్రయత్నంలో తలపై కొట్టిన ఆనవాళ్లు కనిపించాయని పోలీసులు తెలిపారు. ఆ ధాటికి దాలమ్మ సంఘటన స్థలంలోనే మృతి చెందారు. ఉదయం పక్కింటి వాళ్లు చూసే సరికి దాలమ్మ రక్తపు మడుగులో కనిపించడంతో వారు వెంటనే పోలీసులకు సమాచారం అందజేశారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. అనంతరం మృతురాలి కుమారుడు రామారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ వి.సత్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



నగరం.. జలమయం

శ్రీకాకుళం అర్బన్: ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షంతో నగరంలోని ఆర్టీసీ కాంప్లెక్స్‌తో పాటు పలు ప్రాంతాలు, కూడళ్లు మంగళవారం జలమయమయ్యాయి. డే అండ్ నైట్ కూడలి, కృష్ణా పార్కు, రైతుబజారు, ఇల్లీసుపురం, పాతబస్టాండ్ కూడలి, అరసవల్లి కూడలి, కిన్నెర కాంప్లెక్స్ కూడలి తదితర ప్రాంతాలతో పాటు నగర పరిధిలోని పలు శివారు ప్రాంతాలు నీటితో నిండిపోయాయి. దీంతో ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.

క్లుప్తంగా

పైడితల్లికి పుష్పార్చన


ప్రత్యేక పూల అలంకరణలో చదురుగుడిలో పైడితల్లి అమ్మవారు

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి శ్రీ పైడితల్లి అమ్మవారు మంగళవారం చదురుగుడి, వనంగుడిలలో పుష్పాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఏడిద రమణ ఆధ్వర్యంలో అమ్మవారికి వేకువ జామునుంచి పంచామృ తాలతో అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ఆలయ సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు, తాళ్లపూడి ధనుంజయ్, నేతేటి ప్రశాంత్‌లు శాస్త్రోక్తంగా నిత్య పూజాదికాలు చేశారు. మహిళలు అమ్మవారిని దర్శించి పసుపు, కుంకుమలను సమర్పించి మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయం వెనుక ఉన్న వేప,రావిచెట్ల వద్ద దీపారాధన చేశారు. ఆలయ ఇన్‌చార్జ్ ఈఓ కేఎన్ వీడీవీ ప్రసాద్ కార్యక్రమాలను పర్యవేక్షించారు.

హోంగార్డు కుటుంబానికి 'చేయూత'

- రూ.3 లక్షల చెక్కు అందజేత


హోం గార్డ్ కుటుంబానికి చెక్కును ఇస్తున్న ఎస్పీ వకుల్ జిందల్

విజయనగరం క్రైమ్: జిల్లా పోలీసుశాఖలో హెూంగార్డుగా పని చేసి, ఇటీవల ఉద్యోగ విరమణ చేసిన బీవీ రమణమూర్తికి 'చేయూత' కింద రూ.3,23,050 చెక్కును ఎస్పీ వకుల్ జిందల్ డీపీఓలో మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీసుశాఖలో పని చేస్తూ ప్రమాదవశాత్తు లేదా అనారోగ్యంతో మరణించినా లేదా ఉద్యోగ విరమణ చేసిన హోంగార్డు కుటుంబాలను ఆర్థికంగా ఆదుకునేందుకు హెూంగార్డ్స్ స్వచ్ఛందంగా ఒకరోజు డ్యూటీ అలవెన్సు మొత్తాన్ని పోగు చేసి, వారి కుటుంబాలకు చేయూతగా అందజేయడం అభినందనీయమన్నారు. ఈ తరహా చర్యలు చేపట్టడం వల్ల పోలీసు ఉద్యోగుల్లో ఐకమత్యం పెరగడంతో పాటు, వారి కుటుంబాలకు అండగా ఉన్నామన్న భరోసా లభిస్తుందని ఎస్పీ వకుల్ జిందల్ అన్నారు. కార్యక్రమంలో హెూంగార్డ్స్ ఇన్‌చార్జ్ ఆర్ఐ ఆర్.రమేష్ కుమార్, ఆఫీసు సూపరింటెండెంట్ టి.రామకృష్ణ, పోలీసు కుటుంబసభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

విష జ్వరంతో గిరిజన విద్యార్థిని మృతి


మేఘన (ఫైల్)

రామభద్రపురం: మండలంలోని జన్నివలస పంచాయతీ మెట్టవలస గ్రామానికి చెందిన గిరిజన విద్యార్థిని పదవ తరగతి చదువుతున్న కుడుమూరు మేఘన(14) విషజ్వరంతో సోమవారం రాత్రి మృతిచెందింది. ఈ సంఘటనపై మృతురాలి తల్లి సంధ్య తెలిపిన వివరాల ప్రకారం..రెండు రోజులుగా ఆమెతో పాటు కుమారుడు మహేంద్ర విషజ్వరాలతో బాధపడుతున్నారు. గ్రామానికి వచ్చే ఆర్ఎంపీ డాక్టర్ వద్ద మందులు వాడుతున్నారు. ఇంతలో సోమవారం ఉదయానికి చిన్న కూతురు మేఘన(14)కు కూడా జ్వరం సోకింది. వెంటనే ఆర్ఎంపీని పిలిచి వైద్యపరీక్షలతో పాటు రక్త పరీక్షలు చేశారు. రక్తపరీక్షల్లో మలేరియాతో పాటు పచ్చకామెర్లు సోకినట్లు డాక్టర్ చెప్పగా మందులు కూడా వాడారు. సాయంత్రానికి కూడా తగ్గకపోవడంతో డాక్టర్ సూచన మేరకు సాలూరు ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ డాక్టర్లు పరీక్షించి జ్వరం విషమించింది వెంటనే విజయనగరం తీసుకెళ్లాలని సూచించారు. దీంతో తండ్రి సన్యాసిరావు మేఘనను 108లో విజయనగరం ఆస్పత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మేఘన మృతదేహాన్ని సొంత గ్రామానికి తీసుకొచ్చాక చూసిన కుటుంబసభ్యులు అమ్మా వేసవి సెలవులకు వచ్చి తిరిగిరాని లోకానికి వెళ్లిపోయావా? అంటూ రోదిస్తున్న తీరు అందరినీ కంటతడి పెట్టించింది. జ్వరం వచ్చిన ఒక్కరోజులోనే మృతి చెందడమేంటని గ్రామస్తులంతా ఆశ్చర్యానికి గురవుతున్నారు. మేఘన కొటికిపెంట ఏకలవ్య పాఠశాలలో చదువుతోంది. ఆమె తమ్ముడు మహేంద్ర గొట్లాం ప్రభుత్వ పాఠశాలలో 7వ తరగతి చదువుతూ అక్కడే హాస్టల్‌లో ఉంటున్నాడు. మృతురాలి అక్క సాలూరులో నర్సు శిక్షణ తీసుకుంటోంది.

అరకొరగా పీహెచ్‌సీల్లో ప్రసవాలు..!

- లక్ష్యానికి దూరంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు
- నెలకు 10 ప్రసవాలు నిర్వహించాలని టార్గెట్
- ఏడాదికి మూడు, నాలుగు మాత్రమే నిర్వహణ
- జిల్లాలో 48 పీహెచ్‌సీలు


రాకోడు పీహెచ్‌సీ

విజయనగరం ఫోర్ట్: జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రా(పీహెచ్‌సీ)ల్లో ప్రసవాలు అంతంతమాత్రంగానే జరుగుతున్నాయి. నిర్దేశించిన లక్ష్యానికి అనుగుణంగా అధికశాతం పీహెచ్‌సీల్లో ప్రసవాలు జరగడం లేదు. ప్రసవాలు నిర్వహించడంలో అలసత్వం వహించడం వల్ల గర్భిణులు ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సాధారణ ప్రసవాలను సైతం చాలా పీహెచ్‌సీలు నిర్వహించడానికి ఆసక్తి కనబరచడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రతి పీహెచ్‌సీలో ప్రసవాలు నిర్వహించాలని వైద్య ఆరోగ్యశాఖ అధికారులు వైద్యసిబ్బందికి చెబుతున్నారు. అయినప్పటికీ కొంతమంది అలసత్వం వీడడం లేదనే గుసగుసలు వినిపిస్తున్నాయి. కొన్ని పీహెచ్‌సీలైతే ఏడాదికి కనీసం 10 ప్రసవాలు కూడా నిర్వహించడం లేదు.

2024ఏప్రిల్ నుంచి 2025 మార్చి వరకు అతి తక్కువ ప్రసవాలు నిర్వహించిన పిహెచ్‌సీ వివరాలు:	
పీహెచ్‌సీ	ప్రసవాల సంఖ్య
మరుపల్లి	3
ఆర్. ఆముదాలవలస	3
జి. బొండపల్లి	4
కొండవెలగాడ	4
పాగిరి	4
సంతకవిటి	4
వేపాడ	4
మందవకురిటి	5
కొత్తవలస	6
కొట్టాం	6
గంట్యాడ	7
కోనూరు	7
పెరుమాళి	7
సతివాడ	7
తెట్టంగి	7
వంగర	7
కర్లాం	8
పోలిపల్లి	8
బొండపల్లి	9
బొద్దాం	10
బూరాడ	10
దేవుపల్లి	10
వియ్యంపేట	10
బొద్దాం(వేపాడ)	11
దత్తిరాజేరు	12
రాకోడు	12
కె. కొత్తవలస	13
మెరకముడిదాం	14
పక్కి	14
గరివిడి	15
పెదమజ్జిపాలెం	15
డెంకాడ	16
గుర్ల	18
జామి	18
ఎల్.కోట	19
రెల్లివలస	22
వేపాడ	22
అలమండ	23
మెంటాడ	23
మోపాడ	23
చల్లపేట	27
తెర్లాం	27
రామభద్రపురం	29

నెలకు 10 ప్రసవాలు లక్ష్యం

జిల్లాలో 48 పీహెచ్‌సీలు ఉన్నాయి. ప్రతి పీహెచ్‌సీలో నెలకు 10 ప్రసవాలు నిర్వహించాలి. ఈ లెక్కన ప్రతి పీహెచ్‌సీ పరిధిలో 120 ప్రసవాలు జరగాలి. అయితే జిల్లాలో ఉన్న ఏ ఒక్క కేంద్రంలో కూడా 120 ప్రసవాలు జరగలేదు. కొన్ని కేంద్రాల్లో అయితే నెలకు ఒక ప్రసవం కూడా జరిపించడం లేదు. ఏడాదిలో కొన్ని పీహెచ్‌సీలు మూడు ప్రసవాలు నిర్వహించగా, కొన్ని 4 ప్రసవాలు మాత్రమే ప్రసవాలు నిర్వహించాయి. దీనిని బట్టి పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు.

నమ్మకం కల్గించడంలో విఫలం

ప్రతి పీహెచ్‌సీ గ్రామీణ ప్రాంతాలకు దగ్గరగా ఉంటుంది. కొన్ని కేంద్రాలు గ్రామాలకు మూడు నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉంటాయి. మరి కొన్ని 8 నుంచి 10 కిలోమీటర్ల దూరంలో ఉంటాయి. గర్భిణులకు పురిటి నొప్పులు వచ్చిన ఐదు, 10 నిమిషాల్లో పీహెచ్‌సీకి చేరుకునే అవకాశం ఉంటుంది. ఇటువంటి పరిస్థితుల్లో పీహెచ్‌సీల్లో ప్రసవం జరిపించగలిగితే గర్భిణులకు కేంద్రాల పట్ల నమ్మకం కలుగుతుంది. తద్వారా ఎక్కువ మంది ప్రసవం జరిపించుకోవడానికి ఆసక్తి చూపుతారు. అయితే పీహెచ్‌సీల్లో ఇద్దరు వైద్యులు ఉన్నప్పటికీ అందుబాటులో ఉండరనే అపవాదు ఉంది. ఏ సమయంలో వచ్చినా ప్రసవం జరిపిస్తారనే నమ్మకం గర్భిణులకు కలగడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

అన్ని పీహెచ్‌సీల్లో ప్రసవాలు నిర్వహించాలి



ప్రతి పీహెచ్‌సీలో నెలకు 10 ప్రసవాలు నిర్వహించాలి. ప్రసవాలు నిర్వహించడంలో అలసత్వం వహించిన వైద్య సిబ్బందితో సమీక్ష నిర్వహించి లక్ష్యానికి అనుగుణంగా ప్రసవాలు జరిగే విధంగా చర్యలు తీసుకుంటాం.
డాక్టర్ ఎస్.జీవనరాణి, డీఎంహెచ్‌ఓ

సైబర్ నేరాల ఛేదనకు దర్యాప్తు ముమ్మరం



సీఐలు, ఎస్సైలతో సమీక్ష నిర్వహిస్తున్న ఏఎస్పీ సౌమ్యలత

- ఏఎస్పీ సౌమ్యలత సమీక్ష

విజయనగరం క్రైమ్: జిల్లాలోని వివిధ పోలీస్‌స్టేషన్లలో నమోదైన సైబర్ కేసులను అదనపు ఎస్పీ పి.సౌమ్యలత జిల్లా పోలీసు కార్యాలయంలో మంగళవారం సమీక్షించారు.సైబర్ నేరాలను ఛేదించేందుకు దర్యాప్తును వేగవంతం చేయాలని, కేసుల మిస్టరీని ఛేదించి బాధితులకు న్యాయం చేయాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. సైబర్ నేరాల ఛేదనకు అవసరమైన సాంకేతిక నైపుణ్యాన్ని దర్యాప్తు అధికారులు మెరుగుపర్చుకోవాలని సూచించారు. సైబర్ నేరాల్లో బాధితులు ఏ తరహాలో మోసపోయింది? ఆయా కేసుల్లో ఇప్పటివరకు సంబంధిత దర్యాప్తు అధికారులు చేపట్టిన దర్యాప్తు, తీసుకున్న చర్యలను అధికారులను అడిగి అదనపు ఎస్పీ తెలుసుకున్నారు. సైబర్ నేరాలు జరిగిన వెంటనే బాధితులు సంప్రదించి, సకాలంలో 1930కు ఫిర్యాదు చేసే విధంగా ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. సైబర్ మోసానికి గురైన తరువాత బాధితుల నగదు ఎవరి బ్యాంకు ఖాతాకు బదిలీ జరిగింది? ఎక్కడ, ఎవరు ఆయా నగదును విత్ డ్రా చేశారన్న వివరాలను సాధ్యమైనంత వేగంగా రాబట్టాలన్నారు. అనంతరం, ఆయా బ్యాంకు ఖాతాల నుంచి నిందితులు నగదు విత్ డ్రా చేయకుండా ఫ్రీజ్ చేసేందుకు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. తదుపరి ఫ్రీజ్ అయిన నగదు కోర్టు అనుమతితో బాధితుల బ్యాంకు ఖాతాకు జమయ్యే విధంగా చర్యలు చేపట్టాలని చెప్పారు. మోసగాళ్ల ప్రలోభాలకు లొంగవద్దని, ఓటీపీలను ఎవరికీ షేర్ చేయకుండా ఉండాలని ప్రజలకు అవగాహన కల్పించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో సీఐలు బి.సుధాకర్, బి.శ్రీనివాసరావు, ఎస్.శ్రీనివాస్, టి.శ్రీనివాసరావు, బి.లక్ష్మణరావు, శంకరరావు, ఎల్.అప్పలనాయుడు, కె.నారాయణరావు, జి.రామకృష్ణ, కె.దుర్గా ప్రసాద్, షణ్ముఖరావు, ఎ.అశోక్ కుమార్, వి.నారాయణమూర్తి, ఎస్సైలు నజీమా బేగం, రమేష్ కుమార్, షేక్ శంకర్, కె.కిరణ్ కుమార్ నాయుడు, ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్

- జిల్లా రెండవ అదనపు జడ్జి ఎస్.దామోదర్‌రావు


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా రెండవ అదనపు జడ్జి ఎస్.దామోదర్‌రావు

పార్వతీపురం: విద్యతోనే పిల్లలకు ఉజ్వల భవిష్యత్ సాధ్యమని పార్వతీపురం మన్యం జిల్లా రెండవ అదనపు జడ్జి ఎస్.దామోదర్‌రావు అన్నారు. ఈ మేరకు మంగళవారం జిల్లా కోర్టు ఆవరణలో నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ(నల్సా) ఆధ్వర్యంలో నిర్వహించిన లీగల్ సర్వీసెస్ చైల్డ్ ఫ్రెండ్లీ స్కీంలో భాగంగా మండల విద్యాశాఖాధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా మాట్లాడుతూ చదువుపట్ల విద్యార్థుల్లో ఆసక్తిని పెంచాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదేనన్నారు. బడికి రాని పిల్లను గుర్తించి బడిలో చేర్పించేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పించేలా ఉపాధ్యాయులు చొరవ చూపాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని, చదువుకు జాతి, లింగం, భాష, మతంతో సంబంధంలేకుండా పిల్లలును మానసికంగా, నైతికంగా, ఆధ్యాత్మికంగా, సామాజికంగా ఆరోగ్యకరమైన పరిస్థితులలో పెరిగేలా వ్యవస్థను రూపొందించాలని పేర్కొన్నారు. పాఠశాలలో మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందిస్తూ సక్రమంగా పౌష్టికాహారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో లోక్‌అదాలత్ సభ్యుడు టి.జోగారావు, ఏజీపీ బి.సత్యనారాయణ, న్యాయవాది ఎం.వెంకటరామణ, పార్వతీపురం, గరుగుబిల్లి, జియ్యమ్మవలస, కొమరాడ మండలాల ఎంఈఓలు, తదితరులు పాల్గొన్నారు.

రైతన్నకు సేవలు దూరం

- రేషనలైజేషన్ పేరుతో రైతు సేవా కేంద్రాల కుదింపు
- జిల్లాలో వ్యవసాయ, ఉద్యాన సహాయకుల తగ్గింపు



గంట్యాడ మండలంలోని కొటారుబిల్లి రైతు భరోసా కేంద్రం

విజయనగరం ఫోర్ట్: దేశంలో ఏ రాష్ట్రంలో చేయని విధంగా రైతు ముంగిటకే సేవలు అందించాలనే గొప్ప సంకల్పంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రైతు భరోసా కేంద్రాల(రైతు సేవా కేంద్రాలు)ను అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశ పెట్టారు. విత్తు దగ్గర నుంచి పంట కొనుగోలు వరకు అన్ని సేవలు రైతు భరోసా కేంద్రాల ద్వారా అక్కడే అందించేవారు. దీంతో రైతులు విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు వంటివి కొనుగోలు చేయడానికి మండల కేంద్రాలు, జిల్లా కేంద్రాలకు వెళ్లాల్సిన దుస్థితి తప్పింది. రైతులే తమకు కావాల్సిన విత్తనాలు, ఎరువులు పురుగు మందులు ఇండెంట్ పెట్టుకునే విధంగా ప్రతి రైతు భరోసా కేంద్రంలోనూ కియోస్క్‌లను ఏర్పాటు చేశారు. దీంతో రైతులకు వారి గ్రామాల్లోనే సేవలు అందడంతో ఎంతో సంతోషించేవారు.

జగన్‌మోహన్ రెడ్డి పాలన చెరిపేసేలా చర్యలు

రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేయడం వల్ల జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వానికి మంచి పేరు వచ్చింది. అన్ని సేవలు ఒకే చోట అందడంతో అన్నదాతలు జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వాన్ని మెచ్చుకున్నారు. దీంతో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జగన్‌మోహన్ రెడ్డి పాలన ముద్రను చెరిపేసే విధంగా ప్రయత్నిస్తోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. కూటమి ప్రభుత్వం చేపట్టిన చర్యలే ఈ విమర్శలకు ఊతమిచ్చే విధంగా ఉన్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రైతు భరోసా కేంద్రాల పేరును రైతు సేవా కేంద్రాలుగా మార్చేసింది. ఇప్పుడు ఏకంగా రేషనలైజేషన్ పేరుతో రైతు భరోసా కేంద్రాలను కుదించేస్తోంది. ఉన్న సిబ్బందిని కూడా సర్దుబాటు చేస్తోంది. ఒక వైపు ఖాళీ పోస్టులు భర్తీ కాకపోగా, ఉన్న పోస్టులను సర్దుబాటు చేయడంతో కర్షకులకు కష్టాలు రెట్టింపు కానున్నాయి.

జిల్లాలో రైతు భరోసా కేంద్రాలు 396

జిల్లాలో 396 రైతు భరోసా కేంద్రాలు ఉన్నాయి. వాటిలో 10 అర్బన్ రైతు భరోసా కేంద్రాలు కాగా 386 గ్రామీణ ప్రాంత రైతు భరోసా కేంద్రాలు ఉన్నాయి. వాటిలో 383 మంది సిబ్బంది ఉండేవారు. ప్రస్తుతం వారి సంఖ్యను 357కు తగ్గించేసింది. 26 మంది సిబ్బంది తగ్గిపోయారు. 242 మంది గ్రామ వ్యవసాయ సహాయకులకు గాను 223 మందికి తగ్గించేశారు. గ్రామ ఉద్యాన సహాయకులు 79మందికి గాను 72కు తగ్గించేశారు.

రైతు భరోసా కేంద్రాల ద్వారా అందే సేవలు

రైతు భరోసా కేంద్రాల్లో అగ్రికల్చర్ అసిస్టెంట్, హార్టికల్చర్ అసిస్టెంట్, సెరికల్చర్ అసిస్టెంట్, యానిమల్ హస్బెండరీ అసిస్టెంట్, విలేజ్ ఫిషరీస్ అసిస్టెంట్లు ఉండేవారు.

రైతులకు రాయితీపై విత్తనాల పంపిణీ

ఈక్రాప్ బుకింగ్‌కు రైతు డేటాను అప్‌లోడ్ చేయడం పంట సాగుదారుల హక్కు ధ్రువీకరణ పత్రం జారీ, విత్తన సేకరణ కార్యకలాపాలు పీఎం కిసాన్, వైఎస్సార్ రైతు భరోసా, సున్నా వడ్డీ వంటి పంట రుణాల కోసం డేటాను అప్‌లోడ్ చేయడం పొలం బడి,, సీడ్ విలేజ్ ప్రోగ్రాం, మినీకిట్ ట్రయల్ ప్లాట్లు, మొదలైన ఫ్లాగ్ షిప్ పోగ్రాంల నిర్వహణ

పొలం బడి పద్ధతి ప్రదర్శనలు

స్మార్ట్ టీవీ ద్వారా క్రాప్ నిపుణులతో సాంకేతిక స్టేషన్‌ల చిరునామా ప్రత్యక్ష ప్రసారం వివిధ పథకాల కింద లబ్ధిదారుల సామాజిక తనిఖీ డిజిటల్ లైబ్రరీ ద్వారా తెగుళ్ల, వ్యాధులపై అవగాహన కల్పించడం

పశు ఆరోగ్య కార్డుల జారీ

ప్రాథమిక ఆరోగ్య సంరక్షణ, జంతువుల ప్రథమ చికిత్స ఈక్రాప్ బుకింగ్ ద్వారా పశుగ్రాసం అవసరాన్ని లెక్కించడం వంటి కార్యక్రమాలు నిర్వహించేవారు.

రేషనలైజేషన్ పూర్తి

రేషనలైజేషన్ ప్రక్రియ పూర్తయింది. ఆ వివరాలను ఉన్నతాధికారులకు పంపించాం. దానికి అనుగుణంగా సిబ్బందిని కేటాయించనున్నాం.
వి.తారకరామారావు, జిల్లా వ్యవసాయ అధికారి

నిరుపేదలకు ఇళ్లస్థలాలు ఇవ్వండి

విజయనగరం గంటస్తంభం: నిరుపేదలకు ఇళ్లస్థలాలు మంజూరు చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎస్.రంగరాజు డిమాండ్ చేశారు. ఇదే విషయమై ఆయన స్థానిక తహసీల్దారు కార్యాలయానికి మంగళవారం వెళ్లి, అక్కడి డీటీకి వినతిపత్రం అందజేశారు. ఇదివరకు అర్హులైన నిరుపేదలంతా ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్నారని, ఇప్పటివరకు వాటి ఊసే లేదన్నారు. పట్టణాల్లో పేదలకు రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లోని పేదలకు మూడు సెంట్లు స్థలం, నిర్మాణానికి రూ.5 లక్షల ఆర్థికసాయం అందివ్వాలని కోరారు. సూపర్ సిక్స్ హామీల్లో పేదలకు ఇళ్లు ఇస్తామని చెప్పారని, ఇచ్చిన మాట నిలబెట్టుకుని పేదోడి సొంతింటి కల నెరవేర్చాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎన్.నాగభూషణం, సీపీఐ జిల్లా నాయకులు బి.వాసు, మారయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆరుగురు పేకాటరాయుళ్ల అరెస్ట్

విజయనగరం క్రైమ్: నగరంలోని తూర్పు బలిజవీధిలో పేకాట ఆడుతున్న ఆరుగురిని పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. సీఐ శ్రీని వాస్ ఆదేశాలతో ఎస్ఐ కృష్ణమూర్తి, ఏఎస్ఐ నాగేశ్వరరావు మరో నలుగురు కానిస్టేబుళ్లు కలిసి పేకాట శిబిరంపై ఆకస్మిక దాడులు నిర్వహించారు. అనంతరం జూదరులను అదుపులోకి తీసుకుని రూ.12,700 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.


క్రైం కార్నర్

ఆటో బోల్తా పడి గిరిజన మహిళ మృతి


సోమమ్మ మృతదేహం

పాచిపెంట: మండలంలోని పనుకువలస పంచాయతీ చీపురు వలస సమీపంలో మంగళవారం ఆటో బోల్తా పడడంతో జరిగిన ప్రమాదంలో ఓ గిరిజన మహిళ మృతి చెందింది. ఈ సంఘటనపై పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి, మండలంలోని చినచీపురువలస గ్రామానికి చెందిన కోట సోమమ్మ (64) కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తోంది. మంగళవారం ఉదయం గ్రామానికి చెందిన కొంతమంది కూలీలతో కర్రివలస గ్రామంలో పత్తి చేను గొప్పు తవ్వకానికి ఆమె వెళ్లింది. వర్షం కారణంగా పని మధ్యలో ఆగిపోవడంతో, గ్రామస్తులతో కలిసి గ్రామానికి తిరిగి ఆటోలో వెళ్తుండగా చీపురువలస గ్రామ సమీపంలో ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో సోమమ్మకు తీవ్ర గాయాలు కాగా వెంటనే 108 సహాయంతో సాలూరు సీహెచ్‌సీకి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందింది. సోమమ్మ భర్త పారయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెంకట సురేష్ తెలిపారు.

గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యం


రైల్వేలైన్‌లో లభ్యమైన మహిళ మృతదేహం

విజయనగరం క్రైమ్ : విజయనగరం రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యమైంది. ఇందుకు సంబంధించి జీఆర్పీ ఎస్సై బాలాజీ రావు మంగళవారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అలమండ కంటకాపల్లి రైల్వే స్టేషన్ల మధ్య సుమారు 30 ఏళ్ల వయసు కలిగిన ఓ మహిళ మృతదేహాన్ని రైల్వే పోలీసులు మంగళవారం కనుగొన్నారు. మృతురాలి శరీరంపై గ్రీన్ కలర్, గోల్డ్ కలర్ అంచులు గల చీర, నలుపు రంగు జాకెట్ కలిగి ఉన్నట్లు జీఆర్పీ పోలీసులు తెలిపారు. చామన ఛాయ రంగులో ఉండే ఆమె ఎడమ చేతి మోచేతిపై పచ్చబొట్టు ఉన్నట్లు ఎస్సై బాలాజీరావు చెప్పారు. మృతురాలి ఆచూకీ తెలిసినవారు ఫోన్ 9490617089, 08912883218 నంబర్లకు తెలియజేయాలని కోరారు.

మరో గుర్తు తెలియని వ్యక్తి..


గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

విజయనగరం క్రైమ్: జిల్లా కేంద్రంలోని లీలామహల్ రోడ్డు వద్ద మంగళవారం ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందాడు. ఈ మేరకు వన్‌టౌన్ సీఐ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం సుమారు 40 నుంచి యాభై ఏళ్ల మధ్య వయసున్న వ్యక్తి లీలామహల్ రోడ్డులో గల బార్ వద్ద పడి ఉండడంతో స్థానికులు చూసి ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. వెంటనే హాస్పిటల్ సిబ్బంది తమకు సమాచారం ఇచ్చినట్లు సీఐ శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని మృతదేహాన్ని గుర్తు పట్టేవారు ఫోన్ 9121109419 నంబర్‌కు సమాచారం తెలియజేయాలని కోరారు.

యువకుడి ఆత్మహత్య

- ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన


శ్రీనివాసరావు (ఫైల్)

విజయనగరం క్రైమ్: దగ్గరి వారికి తెలిసిన వారి నుంచి అప్పు ఇప్పించడమే ఆ యువకుడి తప్పయింది. డబ్బులు తీసుకున్న తిరిగి చెల్లించకపోవడంతో అప్పు ఇచ్చిన వారి వేధింపులను తట్టుకోలేక కోరుకొండకు చెందిన 27 ఏళ్ల యువకుడు శ్రీనివాసరావు ఆత్మహత్యకు పాల్పడి కన్నవారికి కడుపుకోత మిగిల్చాడు. ఈ నేపథ్యంలో మృతుని స్నేహితులు, బంధువులు, కలెక్టరేట్ ముందు నిరసన వ్యక్తం చేశారు. మంగళవారం వెలుగు చూసిన ఈ ఘటనపై మృతుని కుటుంబసభ్యులు ఇటు జేసీకి, అటు ఏఎస్పీకి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా మృతుడి అన్నయ్య హరీష్ మాట్లాడుతూ తన తమ్ముడు అలమండ సంతలో అనుమానాస్పద స్థితిలో పడి ఉండడంతో విజయనగరం ప్రభుత్వ సర్వజన హాస్పిటల్‌లో చేర్పించగా చికిత్స పొందుతూ మృతిచెందాడని చెప్పాడు. తమ్ముడి మృతదేహం వద్ద ఉన్న ఫోన్‌లో రికార్డ్ అయిన వాయిస్‌ల ద్వారా తెలుసుకున్న సమాచారం మేరకు నలుగురు వ్యక్తుల వేధింపుల కారణంగానే ఆత్మహత్యకు పాల్పడ్డాడని చెప్పాడు. వెంటనే బాధ్యులపై తగు చర్యలు తీసుకోవాలని ఏఎస్పీకి ఫిర్యాదు చేశామని, ఏఎస్పీ ఆదేశాలతో సంబంధిత పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఎస్సైని కలవగా ఫిర్యాదు ఆధారంగా నిందితులను పిలిచి మాట్లాడతామని ఎస్సై చెప్పారని వివరించాడు.

పురుగు మందు తాగి మరో యువకుడు..


వెంకటేష్ మృతదేహం

వంగర: మండల పరిధిలోని అరసాడ గ్రామానికి చెందిన కడుముల వెంకటేష్ (19) మనస్తాపంతో గడ్డిమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీనిపై స్థానికులు వెలడించిన వివరాల ప్రకారం..ఈ నెల 9న గడ్డిమందు తాగిన వెంకటేష్‌ను బంధువులు రాజాం సీహెచ్‌సీకి తరలించి ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం రిమ్స్‌లో చేర్చారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. మృతుడి తండ్రి రెండేళ్ల క్రితం మృతిచెందగా తల్లి రమణమ్మ కూలిపనులు చేస్తోంది. ఏదైనా పని చేసుకోమంటూ కుమారుడికి హితవు చెప్పేది. దీంతో మనస్తాపం చెందిన వెంకటేష్ పురుగు మందు తాగేశాడు. ఈ ఘటనపై మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై షేక్‌శంకర్ తెలిపారు.

వేధింపుల కేసులో ముద్దాయిలకు ఏడాది జైలు

- రూ.51వేల జరిమానా


కేసు వివరాలను వెల్లడిస్తున్న మహిళా పీఎస్ డీఎస్పీ గోవిందరావు

విజయనగరం క్రైమ్: విజయనగరం మహిళా పోలీస్ స్టేషన్‌లో 2018లో నమోదైన వరకట్న వేధింపుల కేసులో ముగ్గురు ముద్దాయిలకు ఏడాది జైలు, రూ.51వేల జరిమానా విధిస్తూ విజయనగరం స్పెషల్ మొబైల్ కోర్టు న్యాయమూర్తి కుమారి పి.బుజ్జి తీర్పు వెల్ల డించినట్లు మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీ ఆర్.గోవిందరావు మంగళవారం చెప్పారు. కేసు వివరాల్లోకి వెళ్తితే..విజయనగరానికి చెందిన ప్రవీణ గోగులకు తమిళనాడు రాష్ట్రంలోని పెరంబదూర్‌కు చెందిన పసుపులేటి జాషువాతో 2017లో పెళ్లైంది. వివాహ సమయంలో రూ.10 లక్షల కట్నం, మూడు తులాల బంగారు వస్తువులను కానుకగా కన్నవారు ఇచ్చారు. పెళ్లైన అనంతరం భర్త పసుపులేటి జాషువా, అతని తల్లిదండ్రులు భాస్కరరావు, సుజాతలు అదనంగా మరో రూ.5లక్షలు కట్నంగా తీసుకురావాలని శారీరకంగా, మానసికంగా వేధింపులకు పాల్పడేవారని 2018 లో ఆగస్టు 6 వ తేదీన అప్పటి దిశ మహిళా పోలీస్ స్టేషన్‌లో బాధితురాలు ఫిర్యాదు చేయగా అప్పటి మహిళా ఎస్సై ఎ.వెంకటరావు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేసి, నిందితులను అరెస్టు చేసి, కోర్టులో అభియోగ పత్రం దాఖలు చేశారు. విచారణలో ఫిర్యాది భర్త పసుపులేటి జాషువా (ఎ1), మామ భాస్కరరావు (ఎ2) అత్త సుజాత (ఎ3) వరకట్న వేధింపులకు పాల్పడినట్లు రుజువు కావడంతో పై విధంగా స్పెషల్ మొబైల్ కోర్టు న్యాయమూర్తి తీర్పు వెలడించారని డీఎస్పీ తెలిపారు. ఈ కేసులో పోలీసుల తరఫున ఏపీపీ శాంతి గౌతమి వాదనలు వినిపించారు. అప్పటి ఎస్సై ఎ.వెంకటరావు దర్యాప్తు చేయగా, కోర్టు కానిస్టేబుల్ వై.పూర్ణ సాక్షులను సకాలంలో కోర్టులో హాజరుపర్చారని డీఎస్పీ ఆర్.గోవిందరావు తెలిపారు.

పంచాయతీ ఆమోదం మేరకే షెడ్డు తొలగించాం


మాట్లాడుతున్న సర్పంచ్ రఘు

పూసపాటిరేగ: పంచాయతీ ఆమోదం మేరకే శ్మశాన వాటిక షెడ్డును తొలగించామని మండలంలోని కొవ్వాడ అగ్రహారం సర్పంచ్ కోట్ల రఘు స్పష్టం చేశారు. ఆ షెడ్డును ఆయన ఎవరికీ చెప్పకుండా తొలగించారన్న దానిపై పలువురు గ్రామస్తులు ఇటీవల అధికారులకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఈ మేరకు ఆయన గ్రామంలో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించి, మాట్లాడారు. బీసీల శ్మశానవాటికలో వాస్తు విరుద్ధంగా నిర్మించిన షెడ్డు కూలేందుకు సిద్ధంగా ఉందని, అందుకే తొలగించామన్నారు. ఇది గిట్టని కొంతమంది టీడీపీ నాయకులు తనపై ఫిర్యాదులు చేస్తున్నారన్నారు. తొలగించిన షెడ్డు స్థానంలో కొత్త షెడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు దేబార్కి అప్పారావు, వైస్ సర్పంచ్ బడి నర్సయ్య, నీటి సంఘం అధ్యక్షుడు జమ్ము అప్పలనాయుడు, వార్డు సభ్యులు అల్లాడ లక్ష్మి, లెంక లక్ష్మి, పతివాడ మంగమ్మ, కోట్ల సత్యంనాయుడు ఉన్నారు.